అతివలకు స్వయం సహాయం

30 కొత్త సంఘాలకు అవకాశం

న్యూస్‌టుడే, నర్సాపూర్, మెదక్ టౌన్: జిల్లాలోని నాలుగు పురపాలక సంఘాల్లో కొత్తగా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేస్తుండగా మంచి స్పందన వస్తోంది. సంఘాల్లో సభ్యులుగా చేరితే కుటుంబ ఆర్థిక, సామాజిక పరిస్థితులు చక్కబెట్టుకోవచ్చని భావిస్తున్నారు. మెప్మాకు చెందిన రిసోర్సుపర్సన్లు కొత్తగా చేరనున్న మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. 18 నుంచి 60 ఏళ్లలోపు వయసు కలిగిన వారిని సభ్యులుగా చేర్పిస్తున్నారు. ప్రతినెలా కొంత డబ్బు పొదుపు చేసేందుకు సిద్ధమై సంఘాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇలా ఏర్పడిన సంఘాలు నాలుగు నెలలపాటు పొదుపు కొనసాగిస్తే బ్యాంకు స్త్రీనిధి ద్వారా రుణాలు మంజూరు చేస్తూ వివిధ యూనిట్లు నెలకొల్పేలా మెప్మా సిబ్బంది ప్రోత్సహిస్తున్నారు.

కొత్త సభ్యుల చేరికపై ఆర్పీల సమావేశం

మహిళల ఆసక్తి...

నాలుగు పురపాలికల్లో 63మంది ఆర్పీలు ఉన్నారు. వీరు పురపాలికల్లోని వార్డుల వారీగా సమావేశాలు నిర్వహించి కొత్తవారు స్వయం సహాయక సంఘాల్లో చేరితే వచ్చే ప్రయోజనాలను వివరిస్తున్నారు. కొత్తగా ఏర్పడిన తొలుత పది మంది సభ్యుల ఎస్‌హెచ్‌జీకి రూ.75వేలు బ్యాంకు లింకేజీతో రుణం ఇప్పిస్తున్నారు. ఇలా దశల వారీగా రూ.20లక్షల వరకు రుణంగా అందిస్తున్నారు. ప్రతి సభ్యురాలు రూ.335లు పీఎంఎస్‌బీవై పథకానికి, రూ.12లు పీఎంఎస్‌వై పథకానికి చెల్లించడం ద్వారా సభ్యులు ప్రమాద బీమా, సాధారణ మరణానికి ఆర్థిక సహాయం పొందవచ్చని చైతన్యపరుస్తున్నారు. కొత్తగా చేరిన సభ్యులు బ్యాంకులో పొదుపు చేయడం అలవాటు చేసుకుంటున్నారు.

పథకాలపై చైతన్యపరుస్తూ...

సంఘాల్లో చేరిన మహిళలకు మహిళా శక్తి, స్త్రీనిధి, పీఎం స్వనిధి, బ్యాంకు లింకేజీ రుణాలపై అవగాహన కలిగిస్తున్నారు. సంఘాల్లో సభ్యులుగా ఉండి చనిపోయిన వారి స్థానంలో కొత్తవారికి అవకాశం ఇస్తున్నారు. పెళ్లిళ్లు అయ్యాక అత్తగారింటికి వెళ్లేవారు ఆ ఊరిలో ఖాళీ ఏర్పడిన వారి స్థానంలో కొత్త వారిని చేరుస్తున్నారు. 60 ఏళ్లు పైబడిన వారిని తొలగిస్తూ కొత్తవారికి అవకాశం కల్పిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

– ఇందిర, మెప్మా, జిల్లా పీడీ

కొత్త స్వయంసహాయక సంఘాల ఏర్పాటు జరుగుతున్నందున ఆసక్తి ఉన్న మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. కొత్తగా జిల్లా వ్యాప్తంగా సంఘాలను 30కి పెంచుతాం. ప్రైవేటు వడ్డీ వ్యాపారుల నుంచి విముక్తి పొందడానికి ఇదొక చక్కని అవకాశం.

జిల్లాలో కొత్త సంఘాల లక్ష్యాలు

పురపాలిక	లక్ష్యం	ఏర్పాటైనవి	సభ్యులు	ప్రస్తుతమున్నవి	సభ్యులు
మెదక్	04	02	50	815	7454
తూప్రాన్	04	01	25	387	3835
రామాయంపేట	02	0	0	314	3102
నర్సాపూర్	02	01	50	293	2518
మొత్తం	12	04	125	1809	16909

బంతి పూల సోయగం..బతుకమ్మ సంబరం

చిన్న బతుకమ్మల పూల వేడుక సోమవారం నుంచి ప్రారంభంకానుంది. తీరొక్క పూలతో బతుకమ్మలను తయారు చేసేందుకు మహిళలు సిద్ధమయ్యారు. చేగుంట మండలం రుక్మాపూర్‌లో బంతిపూల సాగు ముమ్మరంగా చేవట్టారు. ప్రస్తుతం తోట అంతా పూలు విరబూసి ఆకట్టుకుంటోంది.
–న్యూస్‌టుడే, చేగుంట

ఆదర్శ బోధన సాగేనా..!

మెదక్, పెద్దశంకరంపేట, టేక్మాల్, రేగోడ్: ఆదర్శ పాఠశాలల్లో ఇటీవల జరిగిన బదిలీలతో ఖాళీల సంఖ్య పెరిగింది. దీంతో బోధన ఎలా సాగుతుందోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఆదర్శ పాఠశాల, కళాశాలల్లో పనిచేస్తున్న పీజీటీ(పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్), టీజీటీ (ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్)లకు పదకొండేళ్ల తర్వాత విద్యాశాఖ బదిలీలు చేపట్టింది. దీంతో మారుమూల మండలాల్లోని ఆదర్శ పాఠశాలల్లో అధ్యాపకుల కొరత ఏర్పడింది. వీరి స్థానాల్లో హెచ్‌బీటీల(హవర్డ్ బేస్డ్ టీచర్)తో భర్తీ చేపడుతోంది. దీంతో బోధన ఎలా సాగుతుందనే ప్రశ్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులను వెంటాడుతోంది.

బదిలీలతో అధ్యాపకుల కొరత

- పెద్దశంకరంపేట ఆదర్శ పాఠశాలలో మొత్తం 15 మంది టీచర్లు బదిలీ కాగా ఐదుగురు మాత్రమే వారి స్థానాల్లో బదిలీపై వచ్చారు. దీంతో ప్రస్తుతం 9 పోస్టులను హెచ్‌బీటీల ద్వారా భర్తీ చేపట్టేందుకు చర్యలు చేపట్టారు.
- టేక్మాల్ పాఠశాలలో 13 మంది బదిలీ కాగా ఏడుగురు టీచర్లు మాత్రమే వచ్చారు. ఇందులో రెండు హెచ్‌టీలు ఉండగా పీటీ స్థానాల్లో టీచర్లు వచ్చారు. దీంతో 9 ఖాళీలు ఏర్పడ్డాయి. వీటిలో సగం హెచ్‌బీటీలను ఎంపిక చేయగా మిగతా వారి ఎంపిక ప్రక్రియ జరుగుతోంది.
- రేగోడ్ ఆదర్శ పాఠశాల ప్రారంభంలో ప్రిన్సిపల్‌తో పాటు 12పీజీటీ, 7టీజీటీ ఉపాధ్యాయుల పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. కాని ప్రిన్సిపల్‌తో పాటు మరో 12మంది ఉపాధ్యాయులను మాత్రమే నియమించింది. ఖాళీగా ఉన్న 7 పోస్టులను అతిథి ఉపాధ్యాయులుగా నియమించుకొని కొనసాగించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో 12మంది ఉపాధ్యాయులు ఒకేసారి బదిలీ కాగా.. ఇక్కడికి ఒక్క ఉపాధ్యాయుడు కూడా రాలేదు. ఏడుగురు అతిథి ఉపాధ్యాయులతోనే విద్యాబ్యాసం కొనసాగుతోంది.

ఇబ్బంది లేకుండా చర్యలు

– రాధాకిషన్, జిల్లా విద్యాధికారి

ఆదర్శ పాఠశాలల్లో బోధనకు ఇబ్బంది లేకుండా.. హెచ్‌బీటీలను నియమించుకోవాలని ప్రిన్సిపాళ్లకు ఆదేశించాం. వెంటనే వారి నియామకాలు చేపట్టి తరగతుల నిర్వహణకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించాం.

మారుమూల మండలాలపై ప్రభావం.....

జిల్లా వ్యాప్తంగా 7 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 6 నుంచి ఇంటర్మీడియట్ వరకు సుమారు 5 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. జిల్లాలో పెద్దశంకరంపేట, చిన్నశంకరంపేట, రేగోడ్, చేగుంట, నర్సాపూర్, రామాయంపేట, టేక్మాల్ మండలాల్లో ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. ఇటీవల జరిగిన బదిలీల్లో ఉపాధ్యాయులు చాలా వరకు పట్టణ ప్రాంతాల పరిధిలో ఉన్న ఆదర్శ పాఠశాలలకు బదిలీ కోరుకున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ ఖాళీలు ఏర్పడ్డాయి. జిల్లాలో మారుమూల ప్రాంతాలుగా భావించే రేగోడ్, పెద్దశంకరంపేట, టేక్మాల్ మండలాల్లో పోస్టింగ్ తీసుకోవడానికి ముందుకు రాలేదు. ఏడు పాఠశాలల్లో కలిపి పీజీటీ, టీజీటీ, హెచ్‌బీటీలు 79 ఖాళీలు అయ్యాయి. ఇందులో పీజీటీ 40, టీజీటీ 28, హెచ్‌బీటీ 16 పోస్టులు ఉన్నాయి. ఖాళీలను హెచ్‌బీటీలతో స్థానికంగా భర్తీ చేసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు పోస్టుల భర్తీని తాత్కాలిక సిబ్బందితో భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఉపాధ్యాయుల బదిలీలు జరిగి దాదాపు 15 రోజులవుతున్నా ఇంకా పెద్దశంకరంపేట, టేక్మాల్‌లో హెచ్‌బీటీల నియామకాలు పూర్తి కాలేదు.

అర్హులైన పేదలకు ఇళ్లు పంచాలి

మాట్లాడుతున్న మల్లేశం

నర్సాపూర్, న్యూస్‌టుడే: నర్సాపూర్‌లో నిర్మాణం పూర్తయిన రెండు పడక గదుల ఇళ్లను అర్హులైన పేదలకు పంచాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి ఏ.మల్లేశం డిమాండ్ చేశారు. నర్సాపూర్‌లో నిర్వహించిన పార్టీ డివిజన్ మహాసభలో ఆదివారం ఆయన పాల్గొని ప్రసంగించారు. కొండాపోచమ్మ కాల్వల నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని అన్నారు. ఆర్ఆర్ఆర్ నిర్మాణంలో భూనిర్వాసితులకు న్యాయమైన పరిహారం చెల్లించకుంటే, రైతులకు మద్దతుగా పోరాటం చేపడుతామన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు నర్సమ్మ, మల్లేశం, బస్వరాజు, డివిజన్ కమిటీ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మత్తులో పలువురిపై దాడి!

శివ్వంపేట, న్యూస్‌టుడే: గంజాయి మత్తులో పలువురిపై దాడి చేసిన ఘటన శివ్వంపేట మండలం పెద్దగొట్టిముక్లలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ప్రశాంత్ గంజాయి మత్తులో చండి గ్రామానికి చెందిన పాల వ్యాపారిపై దాడి చేశాడు. అతడిని అడ్డుకొనేందుకు రమేష్ ప్రయత్నించాడు. ఆయనపై కూడా దాడి చేయడంతో నాగరాజు, దుర్గప్రసాద్‌లు ప్రశాంత్‌ను నిలువరించడానికి వెళ్లారు. ప్రశాంత్ అక్కడితో ఆగకుండా నాగరాజు ఛాతి, దుర్గాప్రసాద్ చేతిపై బలంగా కొరికాడని బాధితులు తెలిపారు. దంతాలు చర్మంలోకి దిగడంతో ఇద్దరికీ రక్త గాయాలయ్యాయి. గ్రామస్థులు డయల్ 100కు కాల్ చేయడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. గాయాలైన ఇద్దరిని స్థానిక వైద్యుని వద్దకు తీసుకెళ్లి చికిత్స చేయించారు. పోలీసులు తీసుకెళ్లి వదిలిపెట్టిన ప్రశాంత్ తిరిగి గ్రామంలోకి వచ్చి మరోసారి హల్‌చల్ చేశాడు. సంఘటనపై శివ్వంపేట ఎస్సై మహిపాల్ రెడ్డిని సంప్రదించగా.. దాడి చేసిన విషయం తెలియడంతో పోలీస్ సిబ్బంది వెళ్లి గొడవను సద్దుమణిగేలా చేశారని, ఫిర్యాదు రాగానే కేసు దర్యాప్తు చేస్తామన్నారు.

దుర్గాప్రసాద్ చేతిపై గాయం

నాగరాజు ఛాతిపై కొరికిన గాయం

నాణ్యతతో లడ్డూ... రుచికరమైన పులిహోర

పాపన్నపేట, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయానికి రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు ఉంది. అమ్మవారి దర్శనానికి పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. ఏటా వివిధ రూపాల్లో అమ్మవారికి రూ.7కోట్ల వరకు ఆదాయం సమకూరుతుంది. ఆలయం వద్ద మహాశివరాత్రి జాతరను ప్రభుత్వం రాష్ట్ర ఉత్సవంగా నిర్వహిస్తుంది. అమ్మవారి ప్రసాదంగా లడ్డూ, పులిహోర విక్రయిస్తుంటారు.

ఏడుపాయలలో భక్తులకు విక్రయం

ఏటా 3 లక్షల అమ్మకం..

ఆలయం వద్ద 80గ్రా. బరువుండే లడ్డూను రూ.20కి, 150 గ్రాములుండే పులిహోరను రూ.10లకు విక్రయిస్తున్నారు. జాతర, మాఘ అమావాస్య, నవరాత్రి ఉత్సవాల సమయంలో, మంగళ, శుక్ర, ఆదివారాల్లో లడ్డూ, పులిహోర అధికంగా విక్రయిస్తారు. జాతర సమయంలో లక్షకుపైగా లడ్డూలు, 30క్వింటాళ్ల పులిహోర, ఇలా మొత్తం ఏడాది పొడవునా సుమారు 3.50లక్షల లడ్డూలు, సుమారు 80క్వింటాళ్ల పులిహోర విక్రయిస్తారు. ఆలయానికి రూ.కోటికి పైగా ఆదాయం సమకూరుతోంది. లడ్డూ తయారీలో విజయ డెయిరీ నెయ్యి, గుర్తింపు పొందిన రిఫైన్డ్ నూనెను వాడుతున్నారు. లడ్డూ, పులిహోరను తయారు చేసే సమయంలో చేతులకు తొడుగులు, మాస్కులు, తలపై కుకింగ్ క్యాప్ ధరిస్తున్నారు. ఏటా ఆన్‌లైన్ సీల్ టెండరు వేసి పేరొందిన దుకాణాల నుంచి ముడి సరుకులు దిగుమతి చేసుకుంటున్నారు. నిత్యావసర సరకుల ధరలు పెరిగినప్పటికీ భక్తులపై భారం వేయకుండా.. ఐదేళ్లుగా ఇవే ధరలు కొనసాగిస్తున్నారు.

లడ్డూలు తయారు చేస్తున్న సిబ్బంది

సన్న బియ్యంతో తయారీ..

పులిహోర తయారీలో ఒక కిలోకు 24 ప్యాకెట్ల వరకు తయారవుతున్నాయి. సన్న బియ్యంతో అన్నం తయారు చేసి ఆరబోస్తారు. అనంతరం చింతపండు పులుసులో పల్లీలు, మినపప్పు, శనగపప్పు, కరివేపాకు, జీలకర్ర, ఆవాలు, మెంతులు, ఇంగువా, తదితర పదార్థాలు కలిపేస్తారు. ఎప్పటికప్పుడు పులుసు చేయడం, ఇంగువ కలపడం ద్వారా రుచికరంగా ఉంటుందని తయారీ దారులు చెబుతున్నారు.

ప్రమాణాలు పాటిస్తూ...

–చంద్రశేఖర్, ఈవో, ఏడుపాయల ఆలయం

ఆలయం వద్ద ప్రసాదంగా విక్రయించే లడ్డూ, పులిహోర తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నాం. ఎప్పటికప్పుడు సిబ్బంది ప్రసాదాలు తయారీ చేస్తున్నారు. ప్రక్రియను తరచూ పరిశీలిస్తూ సూచనలు చేస్తున్నాం. భక్తులకు ఇబ్బంది లేకుండా లడ్డూ, పులిహోర విక్రయిస్తున్నాం.

ఏడుపాయల ఆలయం

తయారీ ఇలా...

కిలో పిండికి సుమారు 50 లడ్డూల చొప్పున.. క్వింటాలుకు 5వేల తయారు అవుతున్నాయి. రిఫైన్డ్ నూనెలో శనగపిండితో బూంది తయారు చేస్తారు. చక్కెర పాకం, నెయ్యి, ఎండుద్రాక్ష, జీడిపప్పు, ఇలాయిచీ, పచ్చకర్పూరం, జాజికాయ, తదితరలు కలిపి

పల్లెలకు నిధులు.. పాలనకు వెలుగులు

న్యూస్‌టుడే–మెదక్: ఇన్నాళ్లూ నిధుల లేమితో పల్లెల్లో పాలన పడకేసింది. ట్రాక్టర్ కిస్తీలు, కరెంటు బిల్లులు, పారిశుద్ధ్య కార్మికుల వేతనాల చెల్లింపులు లేక, పనులు సాగక ఇబ్బందులు ఏర్పడ్డాయి. పాలకవర్గాలు లేకపోవడంతో ప్రత్యేక పాలన అస్తవ్యస్తంగా మారుతున్న క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ప్రజలు ఆరోగ్యంగా ఉండటానికి కాలువల్లో ఉన్న మురుగును ఎత్తిపోస్తూ.. రోడ్లన్నీ శుభ్రం చేస్తూ.. చెత్తను సేకరిస్తూ.. మొక్కలను కంటికి రెప్పలా కాపాడుతున్న కార్మికులకు సకాలంలో వేతనాలు అందక ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారు. వీటిని దూరం చేయడానికి, ఇతరత్రా అభివృద్ధి పనులు చేపట్టడానికి నిధులను విడుదల చేసింది.

జిల్లాలో ఇలా...

- మండలాలు: 21
- గ్రామ పంచాయతీలు: 493
- పారిశుద్ధ్య కార్మికులు: 1,707

కేటాయించిన నిధులు...

విద్యుత్తు ఛార్జీలు	రూ.1.40 కోట్లు
స్వచ్ఛదనం, పచ్చదనం	రూ.2.17 కోట్లు
కార్మికుల వేతనాలు	రూ.1.71 కోట్లు
ట్రాక్టర్ ఈఎంఐలకు	రూ.37.47 లక్షలు

కార్యదర్శులపై భారంపడకుండా...

ఈ ఏడాది ఫిబ్రవరి 2 వరకు సర్పంచులు పాలకవర్గాలకు బాధ్యత వహించారు. పల్లెల్లో ఏపని కావాలన్నా వారే ముందుగా ఖర్చు చేసి తర్వాత బిల్లులు డ్రా చేసుకునే వారు. వారి పదవీకాలం ముగిసిన తర్వాత ఆ భారం పంచాయతీ కార్యదర్శులపై పడింది. జిల్లాలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు సొంతంగా రూ.వేలల్లో ఖర్చు చేశారు. మరికొందరు వారి వేతనాలు విడుదల కాగానే అందులో నుంచి వెచ్చించారు. పారిశుద్ధ్యం, వీధిదీపాల నిర్వహణ, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు, కార్మికులకు వేతనాలు, ట్రాక్టర్ నిర్వహణ, డీజిల్ ఖర్చులు, నీటి ట్యాంకులకు సింగిల్ మోటార్లు అమర్చడం వంటి పనులు కార్యదర్శులే సొంతంగా ఖర్చు చేశారు. ఖాతాల్లో డబ్బులు లేకున్నా పాలనను ముందుకు నెట్టుకొస్తున్నా నిధులు విడుదల చేయడంలో జాప్యం చేయడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పంచాయతీ కార్యదర్శులు సైతం ఆవేదన చెందుతూ వచ్చారు.

మెదక్ మండలం తిమ్మక్కపల్లి గ్రామం

కాస్తా ఊరట...

గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం నిధులను విడుదల చేయడంతో కాస్త ఊరట లభించింది. జిల్లాలో 57 పంచాయతీలు ఇంకా ట్రాక్టర్ కిస్తీలు చెల్లించాల్సి ఉంది. ఈమేరకు నిధులు రావడంతో ఇబ్బందులు తీరనున్నాయి. మరోవైపు పారిశుద్ధ్య కార్మికులకు సెప్టెంబరు నెలతో మరో రెండు నెలల వేతనాలు అందాలి. ప్రస్తుతం వేతనాలకు నిధులు కేటాయించారు. ఎట్టకేలకు ట్రాక్టర్ కిస్తీలకు, కరెంటు బిల్లులు, ఇతర అభివృద్ధి పనులు, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు విడుదల చేయడంలో కార్యదర్శులు ఆర్థిక భారం నుంచి బయటపడ్డారు. అసలే వర్షాకాలం వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు మురుగు కాలువలు, రోడ్లు శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి నెలా వేతనాలు చెల్లించేలా చూడాలని కోరుతున్నారు.

పట్టుపట్టారు.. పరిష్కరించారు..

గుంతలమయంగా నాగులపల్లి రోడ్డు

నర్సాపూర్ రూరల్: మండలంలోని నాగులపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. మూసాపేట నుంచి నాగులపల్లి మీదుగా హత్నూర మండలం దౌల్తాబాద్ వెళ్లే రోడ్డు మరమ్మతులు చేయాలని పలుమార్లు అధికారులకు, రాజకీయ నాయకుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో గ్రామస్థులు ఏకమై తోచినంత డబ్బులు ఇవ్వాలని తీర్మానం చేసుకున్నారు. వచ్చిన డబ్బుతో ఆదివారం జేసీబీ, ట్రాక్టర్ సహాయంతో గుంతలపై మట్టి పోయించారు. గ్రామస్థులు పారపలుగు పట్టి చదును చేశారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యను తాత్కాలికంగా పరిష్కారం చేసుకున్నారు.

మట్టిని చదును చేస్తున్న గ్రామస్థులు

అమ్మను దర్శించి.. భక్తితో ఉప్పొంగి..

మాతను దర్శించుకుంటున్న భక్తులు

పాపన్నపేట, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం వారాంతపు సెలవు రోజు కావడంతో ఉమ్మడి జిల్లా వాసులతో పాటు పరిసర జిల్లాలు, జంట నగరాలు, పొరుగు రాష్ట్రాలు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ పరిసరాలు అమ్మ నామస్మరణతో మార్మోగాయి. ప్రధాన ఆలయం వద్ద వరద ప్రవాహం ఉండటంతో తెల్లవారుజామునా రాజగోపురంలో అమ్మవారి ప్రతిష్ఠామూర్తికి అర్చకులు పూజలు చేపట్టారు. పలువురు బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు. పోలీసులు బందోబస్తు చేపట్టారు. శనివారంతో పోలిస్తే ఆదివారం వరద ప్రవాహం కాస్త తగ్గింది. వనదుర్గా ప్రాజెక్టు నుంచి 12,000 క్యూసెక్కుల వరద నీటిని కిందికి వదులుతున్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, న్యూస్‌టుడే: సీఎంఆర్ఎఫ్ పథకం పేదల ఆరోగ్యానికి భరోసాగా నిలుస్తుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. నర్సాపూర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారుడికి రూ.2వేల చెక్కును ఆదివారం ఆమె అందజేశారు. నిరుపేదలు కార్పొరేట్ వైద్యం పొందడానికి ఈ పథకం దోహదపడుతుందన్నారు. బల్దియా ఉపాధ్యక్షుడు నయీమొద్దిన్, నాయకులు సత్యంగౌడ్, సురారం నర్సింహులు, షేక్‌హుస్సేన్, మహ్మద్, ప్రసాద్, ఖైమద్ తదితరులున్నారు.

ఎస్జీటీల సమస్యల పరిష్కారానికి కృషి

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

మెదక్, న్యూస్‌టుడే: ఎస్జీటీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి తెలిపారు. ఆదివారం మెదక్‌లో పీఆర్టీయూ జిల్లా సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అర్హత గల ఎస్జీటీలకు పదోన్నతి ఇవ్వాలన్నారు. బీఈడీ అర్హత కలిగిన ఎస్జీటీలకు మిగిలిపోయిన 5,400 హెచ్ఎం పోస్టుల్లో భర్తీ అయ్యేలా ప్రభుత్వాన్ని ఒప్పిస్తామన్నారు. రాబోయే పీఆర్సీలో ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్ల మధ్య అంతరాన్ని తగ్గించే విధంగా ఉండనుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మణ్ మాట్లాడుతూ.. జీవో 317 ఉపాధ్యాయుల సమస్యకు త్వరలో పరిష్కారంకానుందని, ప్రభుత్వం ఆరోగ్య కార్డులు ఇచ్చే ప్రయత్నం చేస్తోందని తెలిపారు.

జిల్లా అధ్యక్షుడిగా కృష్ణ....

పీఆర్టీయూ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సుంకరి కృష్ణ ప్రధాన కార్యదర్శిగా సామ్య నాయక్ గెలుపొందారు. కార్యక్రమంలో జిల్లా, రాష్ట్ర బాధ్యులు వెంకట్రాంరెడ్డి, చారి, శ్రీనివాస్, మల్లారెడ్డి, చంద్రశేఖర్, సంతోష్ కుమార్, రమేష్, సత్యనారాయణరెడ్డి, దుర్గయ్య, సహదేవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9000014771
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 8008001735

B.Ed. Ed-CET without Ed-CET Seats are Available
9866969622, 9912327209

పదవీ విరమణ శుభాకాంక్షలు

శ్రీమతి & శ్రీ జంగం నర్సింలు - యాదమ్మ
జూనియర్ అసిస్టెంట్
జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్ కార్యాలయము, మెదక్
గడిచిన 28 ఏళ్లుగా నిర్విఘ్నంగా, నిజాయితీ, అంకితభావంతో పనిచేసి అందరి మన్ననలు పొందిన మా అభివృద్ధి కోసం అనునిత్యం మా ఉన్నతి కోసం, కష్టపడి ప్రేమించిన మీరు నేడు (30-09-2024) పదవీవిరమణ చేయు సందర్భంగా మనవి మా శుభాకాంక్షలు. మీ భావి జీవితం నిండు నూరేళ్లు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో విలసిల్లాలని మనసారా కోరుకుంటూ..
ఇట్లు: జంగం సత్తెమ్మ (తల్లి)
కుమారుడు- కోడలు
జంగం సాయిప్రసాద్ - రేఖ M.Tech
మనువడు: జంగం శ్రీనిత్
మనవరాలు: జంగం శ్రీనిక
అల్లుళ్ళు- కూతుర్లు
B. రాజు - ప్రవీణ M.Sc., B.Ed.
P. సురేష్‌బాబు - స్రవంతి M.A., B.Ed.
మనవరాలు: B. సాయివిధాత్రి
మనుమళ్ళు: B. మనివన్నరాజ్, P. నివాన్నరాజ్
తాతయ్య అటకుండాం రా
J. శ్రీనిత్‌రాజ్
J. శ్రీనికరాజ్
జంగం వారి కుటుంబ సభ్యులు & బంధుమిత్రులు

ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు

శ్రీమతి & శ్రీ వొంటరి మధుసూధన్‌రెడ్డి - కరుణ
A.A.O/E.R.O/మెదక్
విద్యుత్ శాఖ - మెదక్
గత 33 సంలుగా వివిధ నిర్వహణలో అంకితభావంతో పనిచేసి నేడు ఉద్యోగ విరమణ చేయుచున్న శుభ సందర్భంగా వారికివే మా హృదయపూర్వక శుభాకాంక్షలు..
పిల్లలు కూతుళ్ళు - అల్లుళ్ళు: కావ్య - గోపిరెడ్డి, శ్రావ్య - రాఘవ
మనుమలు - మనుమరాళ్ళు: ఆర్వీరెడ్డి, అర్జున్‌రెడ్డి
వొంటరి కుటుంబ సభ్యులు
తూప్రాన్, మెదక్, విద్యుత్ అధికారులు మరియు సిబ్బంది

(c) eenadu

ట్రాన్స్‌జెండర్ల ఉపాధికి భరోసా

జిల్లాల వారీగా ట్రాన్స్‌జెండర్లు
సంగారెడ్డి 46
మెదక్ 09
సిద్దిపేట 07
వికారాబాద్ 138

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఉన్న ఊర్లో ఐదు కి.మీ. లోపు పని కల్పిస్తోంది. పేదలకు ఈ పథకం వరంగా మారింది.
గ్రామీణ ప్రాంతాల్లో వయోజనులలో ప్రతి కుటుంబానికి ఏడాది పాటు వంద రోజుల పని కల్పిస్తున్నారు. ఈ క్రమంలో ఉపాధి పనుల్లో ట్రాన్స్‌జెండర్లకు సైతం చోటు కల్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. సమాజంలో వారిని చిన్నచూపు చూడకుండా సమాన అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. వారు కోరుకున్న చోట్ల జాబ్ కార్డు వెంటనే ఇవ్వాలని ఆదేశాలివ్వడం గమనార్హం. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఈ దిశగా కసరత్తు చేస్తున్నారు. ఆసక్తి ఉన్న వారిని చేర్పించేందుకు శ్రీకారం చుట్టారు.

పని చేస్తున్న కూలీలు

దరఖాస్తు ఇలా..

ఉపాధి హామీ పథకంలో చేరేందుకు ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్ల కోసం దరఖాస్తు ఫారంలో ప్రత్యేక కాలమ్‌ను రూపొందించారు. మండల స్థాయిలో ప్రోగ్రాం అధికారి (పీవో) లాగిన్‌లో జాబ్ కార్డు నమోదుకు అవకాశం కల్పించారు. పని కోరే వారి కుటుంబ సభ్యులందరికీ పని కల్పించాలని ఆదేశాలు జారీ చేసింది. జాబ్ కార్డులో చేర్పులు, మార్పులకు సైతం అవకాశం కల్పించారు.

వివక్ష చూపొద్దని..

పథకంలో చేరిన వారికి పని లేదని చెప్పి పక్కన పెడితే చట్టాన్ని ఉల్లంఘించినట్లేనని ఆదేశాల్లో స్పష్టంచేశారు. వారికి కచ్చితంగా పని చూపించాల్సిందే. అందరు కూలీలతో సమానంగా చూడాల్సిందే. పని ప్రదేశంలోనూ వివక్ష చూపొద్దు. తోటివారికి సైతం ఈ మేరకు అవగాహన కల్పించాలని సూచించారు. ట్రాన్స్‌జెండర్ల సమస్యల పరిష్కారానికి జిల్లా, మండల స్థాయిలో ఓ నోడల్ అధికారిని సైతం నియమించాలని నిర్ణయించారు. పనుల కల్పనలో భాగంగా ఎదురయ్యే సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు.

ఆదేశాలతో చర్యలు:

జ్యోతి, సంగారెడ్డి డీఆర్డీవో

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉపాధి హామీ పథకంలో ట్రాన్స్‌జెండర్లకు పనుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నాం. సంగారెడ్డి జిల్లాలో ముగ్గురు దరఖాస్తు చేసుకున్నారు. మిగిలిన వారు పథకంలో చేరేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నాం.

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్, సిద్దిపేట, నర్సాపూర్, గజ్వేల్

పర్యావరణహితం.. యువ అభిమతం

పర్యావరణ హితమే లక్ష్యంగా డిగ్రీ విద్యార్థులు అడుగులేస్తున్నారు. కళాశాలల్లో ఏకో క్లబ్‌లు ఏర్పాటుచేసుకొని ఆ దిశగా ముందుకు సాగుతున్నారు.
అధ్యాపకుల సహకారంతో క్లబ్‌ల ఆధ్వర్యంలో కళాశాలతో పాటు సమీప గ్రామాల్లోనూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ మన్ననలు అందుకుంటున్నారు.

మొక్కలు నాటి..

మెదక్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు.. ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఏకో క్లబ్ ఏర్పాటైంది. వృక్షశాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ మురళి కన్వీనర్‌గా, అధ్యాపకులు రాజు, విశ్వనాథం సభ్యులుగా కొనసాగుతున్నారు. మొత్తం 150 మంది సభ్యులుగా ఉన్నారు. ఏటా కళాశాలలో పలు మొక్కలను నాటి సంరక్షిస్తున్నారు. ఇటీవల క్యానోఫీ అనే ప్రత్యేక రకానికి చెందిన 30 మొక్కలు నాటారు. నీటి సంరక్షణకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి భూగర్భ జలాలు పెంచేలా కృషి చేస్తున్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా వృక్షా బంధన్ చేపట్టారు. పట్టణంలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి పరిశ్రమలకు విక్రయిస్తున్నారు. తాజాగా నీటి వసతి లేని చోట మొక్కల పెంపకానికి వీలుగా ఎకరాకు సరిపడా 200 విత్తన బంతులు తయారు చేశారు. పాతూర్ శివారులోని అడవిలో వెదజల్లారు.

మెదక్‌లో విత్తన బంతులతో విద్యార్థులు

స్కానింగ్‌తో చరిత్ర తెలిసేలా..

విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ కల్పనతో సిద్దిపేటలోని స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముందంజలో ఉంటోంది. వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఏకో క్లబ్ కీలకపాత్ర పోషిస్తోంది. కళాశాలలో 1500కి పైగా మొక్కలు, చెట్లు పెంచుతున్నారు. కూరగాయలు, ఔషధ, తులసీ, రోజాపూల ఉద్యానాలు నిర్వహిస్తున్నారు. కన్వీనర్‌గా వృక్షశాస్త్ర విభాగాధిపతి డా. రాణి కొమ్మిడి, సభ్యులుగా ఐదుగురు అధ్యాపకులు వ్యవహరిస్తున్నారు. ఏటా ప్రథమ సంవత్సర విద్యార్థులకు సభ్యత్వం కల్పిస్తున్నారు. ఇలా 60 మంది భాగస్వాములవుతున్నారు. 15 రోజులకోసారి స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 500 మొక్కలకు క్యూఆర్ కోడ్‌లను బిగించారు. స్మార్ట్ చరవాణి నుంచి స్కాన్ చేస్తే.. వివరాలన్నీ తెలిసిపోతాయి. దీన్ని ఏళ్లుగా సాగిస్తున్నారు.

త్వరలో ఏర్పాటు..

వికారాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పర్యావరణ పరిరక్షణ కమిటీని త్వరలో ఏర్పాటుచేయనున్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ పీవీ గీతా లక్ష్మి పట్నాయక్ ఆధ్వర్యంలో ఈ దిశగా కృషి జరుగుతోంది. అక్టోబరు 1న విద్యార్థులు, అధ్యాపకులతో కమిటీని ఏర్పాటు చేయనున్నారు. పలు కార్యక్రమాల నిర్వహణకు కార్యాచరణ రూపొందించారు.

న్యూస్‌టుడే, మెదక్ టౌన్, సిద్దిపేట, వికారాబాద్ కలెక్టరేట్

చదువుతూనే ఉద్యోగం..

స్వశక్తితో యువతుల రాణింపు

యోగానే లోకమైంది..

- ఎల్.సింధూరి

ప్రస్తుత తరుణంలో అత్యధిక శాతం యువత సామాజిక మాధ్యమాలకు బానిసలుగా మారి విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారు. చదువుతో పాటు ఆరోగ్యంపై దృష్టి సారించాల్సిన ఆవశ్యకతను విస్మరిస్తున్నారు. కుటుంబ స్థితిని లెక్కచేయక అడ్డగోలుగా ఖర్చు చేస్తూ ఇబ్బందులకు గురవుతున్నారు. ఇందుకు భిన్నంగా మరికొందరు కుటుంబానికి చేదోడువాదోడుగా నిలుస్తూ.. సొంతకాళ్లపై నిలబడుతున్నారు. చదువు సాగిస్తూనే ఉద్యోగం చేస్తూ లక్ష్యాన్ని చేరేందుకు శ్రమిస్తున్నారు. ఈ కోవకు చెందిన ఇద్దరు యువతులు డిగ్రీ దశలోనే యోగా శిక్షకులుగా మారి పది మందికి ఆదర్శంగా నిలుస్తుండటం విశేషం. ప్రతిభను నిరూపించుకునేందుకు ఎక్కడ పోటీలు నిర్వహించినా పాల్గొంటున్నారు. ప్రస్తుతం నిజామాబాద్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో తమ ప్రత్యేకతను చాటేందుకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా వారిని 'న్యూస్‌టుడే' పలకరించింది. ఆయా విశేషాలు ఇలా..

మా సొంతూరు కొండపాక మండలం మర్పడ్గ. సిద్దిపేటలోని మహిళా డిగ్రీ కళాశాలలో బీకామ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నా. అక్కడ చదువును కొనసాగిస్తూనే ఏడాదిగా ఓ ప్రైవేటు పాఠశాలలో యోగా శిక్షకురాలిగా ఉద్యోగం చేస్తున్నా. ఒక ప్పుడు యోగా అంటే కనీస అవగాహన లేదు. గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి చదివే క్రమంలో పీఈటీ సతీశ్ యోగా వైపు మళ్లించారు. అప్పటి నుంచి రాష్ట్ర స్థాయిలో పదిసార్లు, జాతీయస్థాయిలో నాలుగు సార్లు పోటీల్లో పాల్గొన్నా. ప్రస్తుతం నిజామాబాద్‌లో జరుగుతున్న సంప్రదాయ పోటీల్లో పాల్గొంటున్నా. ప్రస్తుతం యోగానే లోకమైంది. పోటీలు ఉంటే నిత్యం, మిగిలిన సందర్భాల్లో పాఠశాలలో పిల్లలకు బోధిస్తూ సాధన చేస్తున్నా. పోలీసు కొలువు సాధనే లక్ష్యం.

నాన్న మరణం కదిలించింది..:

సిద్దిపేట మహిళా డిగ్రీ కళాశాలలో బీజడ్‌సీ ప్రథమ సంవత్సరం చదువుతున్నా. వ్యాస మహర్షి యోగా సెంటర్‌లో శిక్షకురాలిగా చేస్తున్నా. ఆసక్తి ఉన్న వారికి ప్రత్యేకంగా బోధిస్తున్నా. గతంలో ప్రైవేటు పాఠశాలలో బోధించా. ఆరో తరగతి నుంచి యోగాపై ఆసక్తి ఏర్పడింది. రాష్ట్రస్థాయిలో పది, జాతీయస్థాయిలో ఎనిమిది సార్లు పాల్గొన్నా. గతంలో సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో వ్యాస మహర్షి యోగా సొసైటీ సహకారంతో నిర్వహించిన యోగా ఇన్‌స్ట్రక్టర్ కోర్సు పూర్తి చేసి.. అర్హత సాధించా. పిల్లలకు చెబుతూ సాధన చేస్తున్నా. జాతీయస్థాయిలో పతకం సాధించడమే లక్ష్యం. ఏడాది కిందట నాన్న మల్లేశం అనారోగ్యంతో చనిపోయారు. దీంతో శిక్షకురాలిగా మారాల్సి వచ్చింది. సొంతకాళ్లపై నిలబడితే ఆ ఆనందం వేరు. కుటుంబానికి బాసటగా మారా. **ఎ.మనీషా**

న్యూస్‌టుడే, సిద్దిపేట

నేటి నుంచి ఓటరు నమోదు ప్రక్రియ

పట్టభద్రులు, ఉపాధ్యాయ మండలి నమరం

ఈనాడు, కరీంనగర్, న్యూస్‌టుడే, మెదక్: మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు ఓటరు నమోదు ప్రక్రియ సోమవారం షురూ కానుంది. నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో ప్రస్తుతం 15 జిల్లాలున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో ఇప్పటికే కలెక్టర్లు నమోదుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానాల్లో ఓటరుగా నమోదు చేసుకొనే అవకాశముంది. డిగ్రీ ఉత్తీర్ణులైన వారు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో, స్కూల్ అసిస్టెంట్, జేఎల్‌లు(జూనియర్ లెక్చరర్లు), డీఎల్‌లు(డిగ్రీ లెక్చరర్లు), యూడైస్‌లో నమోదైన ప్రైవేటు పాఠశాలల్లోని టీచర్లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటేయవచ్చు.

డిసెంబరు 30న తుది జాబితా: ప్రస్తుతం ఈ స్థానం నుంచి పట్టభద్రుల ఎమ్మెల్సీగా జీవన్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కె.రఘోత్తమ్‌రెడ్డి కొనసాగుతున్నారు. వచ్చే ఏడాది మార్చి 29తో వీరి పదవీ కాలం ముగియనుంది. ఈ ఏడాది నవంబరు తొలి వారం నాటికి కొత్త ఓటరు జాబితాను రూపొందించాలని ఎన్నికల సంఘం నిర్దేశించింది. సెప్టెంబరు 30 నుంచి నవంబరు 6 వరకు ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగనుంది. సవరణలు, ఆక్షేపణలకు గడువు ఇచ్చి డిసెంబరు 30న తుది ఓటరు జాబితా వెల్లడించనున్నారు.

కొత్తగా నమోదు..: ఐదేళ్ల కిందట ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఓటేసిన, వేయని వారంతా తిరిగి కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలి. 2019 మార్చిలో జరిగిన ఎన్నికలతో పోలిస్తే ఈ సారి ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. గతంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే ఎక్కువ మంది ఓటర్లున్నారు. ఈ సారి 15 జిల్లాల పరిధిలో పట్టభద్రులతో పాటు ఉపాధ్యాయు ఓటును నమోదు చేసుకోవాలి. సీఈవో తెలంగాణ వెబ్‌సైట్ ద్వారా ఫారమ్-18లో వివరాలు నమోదు చేయాలి. డిగ్రీ మార్కుల మెమోతో పాటు ఆధార్ సహా ఇతర పత్రాలు జోడించాలి. వాటిని తహసీల్దారు కార్యాలయాల్లో అందజేయాలి. 2021 నవంబరులోగా డిగ్రీ పూర్తి చేసిన వారు పట్టభద్రుల స్థానానికి ఓటు నమోదు చేసుకోవచ్చు.

2019 జాబితా ప్రకారం..

విభాగం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఉపాధ్యాయ	15,892	7,322	-	23,214
పట్టభద్రులు	1,35,218	61,077	26	1,96,321

సాహిత్య కోవెల మరసం

సిద్దిపేట, న్యూస్‌టుడే: మరసం సాహిత్య కోవెల అని, ఎంతో మంది మేధావులు పుట్టుకొచ్చారని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. మంజీరా రచయితల సంఘం(మరసం) 38వ వార్షికోత్సవాన్ని సిద్దిపేట వివంచి కళానిలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను ఆవిష్కరించి, వివిధ కారణాలతో మృతి చెందిన సంఘం ప్రతినిధులు, సామాజిక, సాహితీవేత్తలకు నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దాశరథి స్ఫూర్తితో సాహితీవేత్తలు పోరాటం సాగించారని పేర్కొన్నారు. సాహితీవేత్త, ఆంధ్రజ్యోతి పత్రికా సంపాదకుడు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ మంజీరా మహానదిలా మరసం ప్రవహించిందని, మళ్లీ ఉపనదిలా మారాలన్నారు. సాహిత్యానికి ప్రాతినిధ్యం వహించి మార్గదర్శనం చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ మరసం తనలో పోరాట స్ఫూర్తిని నింపిందన్నారు. ఎన్నో విషయాలను సంఘం నుంచి నేర్చుకున్నానని, ధూంధాం అనే ఆలోచన కల్పించిందన్నారు. ప్రముఖ సాహితీవేత్త, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి, ప్రొఫెసర్ కాశీం, మరసం అధ్యక్షుడు కె.రంగాచారి మాట్లాడారు. అనంతరం దేశపతి శ్రీనివాస్ రచించిన జయజయహే తెలంగాణ పాటల పుస్తకం, మరసం కవులు రచించిన జోట పాటలు సంకలనం, సిద్దెంకి యాదగిరి రచించిన మూడు గుడిసెల పల్లె పుస్తకాలను ఆవిష్కరించారు. టీవీస్టీవో సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు దేవిప్రసాద్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరం, ప్రతినిధులు సిద్దెంకి యాదగిరి, తోట ఆశోక్, పరమేశ్వర్, తిరుపతిరెడ్డి, అంజయ్య ఉన్నారు.

హాజరైన సంఘ ప్రతినిధులు, సాహితీవేత్తలు

పుస్తకాల ఆవిష్కరణలో ప్రొఫెసర్ కాశీం, సాహితీవేత్త కె.శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్. చిత్రంలో ఎడమ నుంచి కుడివైపు సిధారెడ్డి, విరాహత్‌అలీ, రంగాచారి, యాదగిరి తదితరులు

క్రీస్తును స్తుతించి.. ప్రార్థనలు చేపట్టి

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: ప్రఖ్యాత మెదక్ సీఎస్ఐ చర్చి ఆదివారం కరుణామయుడి నామస్మరణతో మార్మోగింది. గురువులు శిలువను ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రార్థనా మందిరంలో ప్రతిష్ఠించారు. డ్రైసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య ఆధ్వర్యంలో ఆరాధన చేపట్టారు. రిటైర్డ్ డ్రైసిబిటరీ శ్రీనివాస్‌రావు దైవసందేశాన్ని వినిపించారు. వివిధ ప్రాంతాల చెందిన భక్తులు, పర్యాటకులు ఏసయ్యను దర్శించుకుని పరవశించారు. గురువులు భక్తులను ఆశీర్వదించారు.

ప్రార్థనా మందిరంలో భక్తులు

వినూత్నం.. కేవీకే భవనం

15 ఎకరాల విస్తీర్ణం.. ఎర్రరాయితో నిర్మించిన భవన సముదాయం.. చుట్టూ పచ్చదనంతో ఆకట్టుకుంటోంది సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం దిడ్గి శివారులోని కృషి విజ్ఞాన కేంద్రం. 1994లో దీన్ని నిర్మించారు. దీని ఆవరణలో వివిధ రకాల పంటల క్షేత్రాలు, పండ్ల తోటలతో పాటు ఔషధ నగరి సైతం ఉంది. ఇక పరిపాలనా భవనాన్ని పూర్తిగా ఎర్రరాయితో నిర్మించారు. అప్పట్లో సిమెంటుకు బదులుగా డంగు సున్నం ఉపయోగించడం విశేషం. సముదాయాన్ని వృత్తాకారంలో రెండు అంతస్తులలో నిర్మించారు. కేంద్రంలో ఉద్యాన, వ్యవసాయ విస్తరణ, గృహ విజ్ఞాన, పశుపోషణ తదితర విభాగాలకు చెందిన ఏడు గురు శాస్త్రవేత్తలు విధులు నిర్వర్తిస్తున్నారు. ఒక్కో విభాగానికి ఒక్కో గదిని కేటాయించారు. అందులో వైకప్పు వృత్తాకారంలో, వాటి ద్వారాలు పిట్టగూళ్లను తలపించేలా ఉంటాయి. భోజనశాల సైతం వృత్తాకారంలో ఏర్పాటుచేశారు. ఇభవనం మధ్యలో విశాలమైన స్థలం, అతిథులు బస చేసేందుకు వసతులు ఉన్నాయి.

- న్యూస్‌టుడే, జహీరాబాద్

తెలంగాణ భవన్ ముట్టడిస్తాం: ప్రాజెక్టుల నిర్వాసితులు

మాట్లాడుతున్న నిర్వాసితులు

గజ్వేల్ గ్రామీణ: వేదల కన్నీళ్లపై అభివృద్ధి చేయడం ఏంటని ప్రస్తుత ప్రభుత్వాన్ని విమర్శిస్తూ మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడటం... దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని మల్లన్న సాగర్, కొండపోచమ్మసాగర్ జలాశయాల నిర్వాసితులు వ్యాఖ్యానించారు. ఇటీవల హైదరాబాద్‌లో 'హైడ్రా' చర్యల వల్ల ఆస్తులు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులతో హరీశ్‌రావు మాట్లాడిన తీరును జలాశయాల నిర్వాసితులు ఎద్దేవా చేశారు. గతంలో భారాస ప్రభుత్వం చేసిన విధ్వంసాలను తెలియజేసేందుకు కన్నెపల్లి నుంచి కొండపోచమ్మ ప్రాజెక్ట నిర్వాసితుల వరకు అందరితో కలిసి తెలంగాణ భవన్‌ను ముట్టడిస్తామని తెలిపారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రాజెక్టుల నిర్మాణంలో వందలాది మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడితే రాని ఏడుపు హరీశ్‌రావుకు ఇప్పుడు ఎలా వస్తోందన్నారు. మల్లన్నసాగర్ భూ నిర్వాసితులపై లాఠీచార్జీ చేసి, 144 సెక్షన్ పెట్టినప్పుడు.. మల్లారెడ్డి అనే నిర్వాసితుడు తన చితిని తానే పేర్చుకొని ఆత్మహత్య చేసుకున్నపుడు ఆయనకు ఎందుకు దుఃఖం రాలేదని ప్రశ్నించారు. తమ హక్కులను అడిగినప్పుడు కేసులు నమోదు చేయించిన విషయం గుర్తుచేసుకోవాలన్నారు. నిర్వాసితులకు ఇప్పటివరకు పూర్తిస్థాయిలో ప్యాకేజీ, పరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేసే హరీశ్‌రావు ఆస్తులు, ఫాంహౌస్‌లపై విచారణ చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. జలాశయాల భూ నిర్వాసితులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, కాంగ్రెస్ గజ్వేల్ మండల పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు భానుప్రకాష్‌రావు పాల్గొన్నారు.

చోరీలకు వచ్చి.. పోలీసులకు చిక్కి

ముగ్గురు అరెస్టు, పరారీలో నలుగురు

నర్సాపూర్: చోరీలకు వచ్చిన ముగ్గురు దొంగలు నర్సాపూర్ పోలీసులకు చిక్కారు. నర్సాపూర్ సీఐ జానకిరెడ్డి తెలిపిన వివరాలు.. నర్సాపూర్‌లో శనివారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న బానోత్ రాములు, రాథోడ్ తారాసింగ్, రాథోడ్ జయరాం పోలీసులకు చిక్కారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించడంతో ఏడుగురు దొంగల ముఠాకు చెందినవారుగా తేలింది. వీరంతా సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలానికి చెందిన వారు. ఆయా కేసుల్లో నిందితులు, పాతనేరస్థులు. సమయానుసారంగా ఐదారుగురు కారులో వచ్చి రాత్రి పూట తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడతారు. గతంలో మెదక్, సంగారెడ్డి జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో ఇళ్ల తాళాలు పగులగొట్టి, విలువైన బంగారం, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లిన ఘటనల్నాయి. నర్సాపూర్ మండలం నత్నాయిపల్లి, చిలప్‌చెడ్ మండలం ఫైజాబాద్, చండూర్, జిన్నారం మండలం సోలక్‌పల్లి, దాదిగూడెంలో చోరీలకు పాల్పడినట్లుగా వెల్లడైంది. ఇలా పీఎస్ నర్సాపూర్-2, చిలప్‌చెడ్-2, జిన్నారం-2లో మొత్తం ఆరు చోరీ కేసుల్లో నిందితులుగా ఉన్నారు. పట్టుకున్న ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుంచి 12 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నామని సీఐ జానకిరెడ్డి తెలిపారు. మరో నలుగురు విజయ్‌కుమార్, రమేశ్, రాజు, రవిలను త్వరలో పట్టుకుంటామన్నారు. ఎస్సై లింగం తదితరులున్నారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు

వరంగల్ క్రీడావిభాగం: హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్-19 క్రికెట్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఆదివారం నగర శివారులోని మొగిలిచర్ల క్రికెట్ మైదానంలో వరంగల్, మెదక్ జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న వరంగల్ జట్టు 49.2 ఓవర్లలో 219 పరుగులు చేసింది. జట్టులో విజేష్ 31 పరుగులు(3 వికెట్లు), రిష్యాంత్ 31 పరుగులు(3 వికెట్లు) తీశారు. ఛేదనకు దిగిన మెదక్ జట్టు 29.4 ఓవర్లలో 110 పరుగులకే ఆలౌట్ అయ్యింది. కోమటిపల్లి మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో మహబూబ్‌నగర్, నల్గొండ జట్లు తలపడగా మహబూబ్‌నగర్ జట్టు గెలిచింది.

ముగిసిన అటవీశాఖ జోనల్ క్రీడోత్సవాలు

ఓవరాల్ ఛాంపియన్‌షిప్ గెలుచుకున్న సిద్దిపేట-మెదక్ జోన్ జట్టు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రెండు రోజులుగా కొనసాగుతున్న రాజన్నసర్కిల్ అటవీశాఖ రెండో జోనల్ క్రీడోత్సవాలు ఆదివారం ముగిశాయి. సిద్దిపేట, మెదక్, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, కామారెడ్డి జిల్లాలకు చెందిన సుమారు 200 వందల మంది ఉద్యోగులు పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. మొత్తం 104 అంశాల్లో పురుషులు, మహిళలు, సీనియర్ వెటరన్స్, జూనియర్ వెటరన్స్ విభాగాల్లో ఉద్యోగులు ప్రతిభ చూపారు. 406 పాయింట్లతో సిద్దిపేట-మెదక్ జిల్లా జట్టు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకుంది. విజేతలకు సిద్దిపేట, కామారెడ్డి, కరీంనగర్ జిల్లాల అటవీశాఖ అధికారులు శ్రీనివాస్, నిఖిత, బాలమణి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. క్రీడలను వ్యాయామోపాధ్యాయులు రామేశ్వర్‌రెడ్డి, సుజాత, వెంకటస్వామిగౌడ్, ఉప్పలయ్య, కనకారెడ్డి, రవీందర్‌రెడ్డి, రాజ్‌మోహన్‌గౌడ్ పర్యవేక్షించారు.

ఆసుపత్రులు, మెట్రోస్టేషన్లే లక్ష్యంగా చోరీలు

సికింద్రాబాద్: నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, మెట్రోస్టేషన్ల వద్ద పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలే లక్ష్యంగా చోరీ చేస్తున్న దొంగను చిలకలగూడ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రూ.10 లక్షల విలువ చేసే 18 బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం స్థానిక ఠాణాలో ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి వివరాలు వెల్లడించారు. కామారెడ్డికి చెందిన శ్రీనివాస్ కూలీ పనులు చేస్తున్నాడు. కుటుంబ పోషణకు డబ్బు చాలక నగరంలోని చర్లపల్లికి వచ్చి బైకుల చోరీ మొదలుపెట్టాడు. దొంగిలించిన వాహనాన్ని తక్కువ ధరకు విక్రయిస్తుంటాడు. రెండ్రోజులుగా గాంధీ ఆసుపత్రి ఆవరణలో బైకులు మాయమవుతుండగా, బాధితుల ఫిర్యాదుతో చిలకలగూడ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌గౌడ్ నేతృత్వంలోని సిబ్బంది మాటు వేసింది. సీసీ ఫుటేజీల ఆధారంగా శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. నీలోఫర్, ఈఎస్ఐ, ఉస్మానియా ఆసుపత్రులు, మియాపూర్, మెట్టుగూడ, నాంపల్లి మెట్రోస్టేషన్లు, మెదక్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పార్కింగ్ చేసిన బైకులు దొంగిలించినట్లు అంగీకరించాడు. శ్రీనివాస్‌తో పాటు బైకులు కొనుగోలు చేసిన ఏసురత్నం, శాంతారావును అదుపులోకి తీసుకున్నారు.

చికెన్ ధరలు

ఫారంకోడి	115-00	డ్రెస్డ్	199-00
రిటైల్	137-00	స్కిన్‌లెస్	226-00

ప్రాణాలు.. గల్లంతు!

లోతట్టు వంతెనల వద్ద తరచూ ప్రమాదాలు

ఉద్ధృతంగా పారుతున్న నారింజ వాగు

- జహీరాబాద్ మండలం బూచినెల్లి వద్ద బుధవారం వంతెన మీదుగా నారింజ వాగును బైక్‌తో దాటుతూ ఒకరు గల్లంతవగా మరొకరు ముళ్ల పొదలు పట్టుకుని ప్రాణాలు కాపాడుకున్నాడు. గల్లంతైన వ్యక్తి మృతదేహం శనివారం దొరికింది.
- న్యాల్‌కల్ మండలం చాల్కి-అమీరాబాద్ మధ్యలో వాగును రాత్రివేళ బైక్‌తో దాటుతూ వరదలో కొట్టుకుపోయి యువకుడు మృతిచెందగా మరొకరు ప్రాణాలతో బయటపడ్డాడు.
- జహీరాబాద్ మండలం సత్వార్‌లోని బంధువుల ఇళ్లకు వచ్చి గ్రామంలోని లోలెవల్ వంతెనను కాలినడక దాటుతూ ఇద్దరు వరద ప్రవాహంలో కొట్టుకుపోయి మృతి చెందారు.

న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్

ఇవీ.. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ డివిజన్‌లోని భారీ వర్షాలు కురిసి వాగులు పొంగడంతో లోతట్టు (లోలెవల్) వంతెనల వద్ద వరద నీటిలో కొట్టుకుపోయి మృత్యువాత పడిన ప్రమాద ఘటనల్లో కొన్ని. 'భారీ వర్షాలు కురిసినప్పుడల్లా వాగులు పొంగుతున్నాయి.. వంతెన మీదుగా వరద ఉద్ధృతంగా పారుతుండటంతో ఆయా మార్గాల్లో రాకపోకలకు నిలిచిపోతున్నాయి. ఆయా వంతెనల ఎత్తు పెంచాలన్న డిమాండ్ ఏళ్లుగా ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఏటా

లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు

ప్రత్యేక అలకంరణలో స్వామివారు

శివ్వంపేట, న్యూస్‌టుడే: సికింద్లాపూర్‌లో వెలిసిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు ధనుంజయ శర్మ, పూజారి విద్యాకర్ చారి అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేకంగా అలంకరించారు. ఈవో శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భోగ్‌బండార్

కౌడిపల్లి, న్యూస్‌టుడే: కౌడిపల్లి శివారులోని జగదాంబ సేవాలాల్ మహారాజ్ ఆలయం వద్ద ఆదివారం గిరిజన స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. పౌరాదేవి పూజారి బల్సిలాల్ ఆధ్వర్యంలో భోగ్‌బండార్ కార్యక్రమం చేపట్టారు. అనంతరం దీక్షాపరులు మహారాష్ట్రలోని పౌరాదేవి ఆలయానికి తరలివెళ్లారు. విద్యుత్తు శాఖ ఏడీఈ దశరథ్, మాజీ సర్పంచి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు బోనాలు

చేగుంట, న్యూస్‌టుడే: కర్నాల్‌పల్లిలో రేణుకా ఎల్లమ్మ తల్లిని ఆదివారం భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. చేగుంట, మెదక్, హైదరాబాద్, తూప్రాన్, మిరుదొడ్డి, దౌల్తాబాద్, రామాయంపేట, వెల్దుర్తి, నార్సింగి, మాసాయిపేట, చిన్నశంకరంపేట, మనోహరాబాద్ తదితర మండలాల నుంచి వేలాది భక్తులు తరలివచ్చారు. బోనాలు తీసి ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు.

కౌడివల్లి: తునికి శివారులో వెలసిన నల్లపోచమ్మ తల్లికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఒడిబియ్యంతో పాటు బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు పర్యవేక్షణ చేశారు.

రేగోడ్‌లో హోమం

రేగోడ్, న్యూస్‌టుడే: అగ్నిహోత్ర హోమంతో సమాజానికి మేలు జరుగుతుందని విశ్వ ఫౌండేషన్ బాధ్యులు రుద్రప్ప అన్నారు. ఆదివారం రేగోడ్‌లో పలువురితో హోమం చేయించారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికత అలవర్చుకోవాలన్నారు.

పంట పొలాల్లో అడవి పందులు

శివ్వంపేట, న్యూస్‌టుడే: రైతులకు అడవి పందుల బెడద సంకటంగా మారింది. అసలే సాగుకు పెట్టుబడులు అధికమై లాభాలు లేక దిగులు చెందుతుంటే అడవి పందులు ఉన్న పంటను నాశనం చేస్తున్నాయి. శివ్వంపేట లోని రైతుల పంట పొలాలను అడవి పందులు శనివారం రాత్రి ధ్వంసం చేశాయి. పొట్ట దశలో ఉన్న వరిని తింటున్నాయి. రాయితీపై సౌర కంచె ఏర్పాటు చేసుకునే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని కర్షకులు కోరుతున్నారు.

ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయండి

నర్సాపూర్, న్యూస్‌టుడే: ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు అమలు చేయాలని హోళియా దాసరి హక్కుల పోరాట సమితి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి శాఖమూరి యాదగిరి ఒక ప్రకటనలో డిమాండు చేశారు. ఈ విషయమై అసెంబ్లీలో ప్రత్యేక చట్టం తెస్తేనే 59 దళిత ఉపకులాలు, 33 గిరిజన ఉపకులాలకు న్యాయం జరుగుతుందన్నారు.

రత్నాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం

శివ్వంపేట, న్యూస్‌టుడే: శివ్వంపేట మండలం రత్నాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం హైదరాబాద్ రామకృష్ణ మఠం శ్రీసేవ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు సుస్మిత, జయమ్మ రోగులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. 160 మంది రోగులకు నెలకు సరిపడా మందులు ఉచితంగా పంపిణీ చేశారు. పాఠశాల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు.

ప్రమాదకరంగా జలవనరులు

- చెట్లు, పొదలతో నిండిన వైనం

వెల్దుర్తి, శివ్వంపేట, చిలప్‌చెడ్, న్యూస్‌టుడే: జలవనరులు ఒకప్పుడు తాగునీటికి నిలయంగా ఉండేవి. చెరువులు, కుంటలు స్వచ్ఛంగా కనిపించేవి. వాటినే తాగునీటికి సైతం వినియోగించేవారు. ప్రస్తుతం గ్రామాలకు దగ్గరలోని ఊర చెరువులే కాదు అటవీ ప్రాంతాల్లో ఉన్న తటాకాలు, కుంటలు కూడా కలుషితం అవుతున్నాయి. ముఖ్యంగా చెట్లు, పొదలు పెరగడం, చెత్త వేయడం, మట్టి తరలించడానికి భారీ గుంతలు తవ్వడం జరుగుతుంది. దీంతో చెరువులు, కుంటలు ప్రమాదకరంగా, ప్రాణాంతకంగా తయారయ్యాయి.

వ్యర్థాలతో చిలప్‌చెడ్ మండలం జగ్గంపేట తటాకం

ఉమ్మడి వెల్దుర్తి మండలంలో..

ఉమ్మడి వెల్దుర్తి మండలంలో 165 తటాకాలు, కుంటలు ఉన్నాయి. వీటిలో అత్యధికంగా చెట్లు, పొదలు పెరిగి ప్రమాదకరంగా మారాయి. మండలంలోని అందుగులపల్లి ఊర, పెద్ద చెరువులో వనాలను పెంచారా అన్నట్లుగా మారాయి. ఈ రెండింట్లోకి దిగాలంటేనే ప్రజలు భయపడే పరిస్థితి వచ్చింది. అందుగులపల్లి తటాకంలో గతంలో మహ్మద్‌నగర్ తండాకు చెందిన రైతు పొలం పనులు చేసి స్నానం చేయడానికి దిగి తూటి కొమ్మలు చుట్టుకుని మృతి చెందాడు. ధర్మారంలో చెట్లతో నిండిపోయింది. గతంలో ఇందులోకి పాడిపశువులు వెళ్లడంతో గ్రామానికి చెందిన యువకుడు వాటిని తీసుకురావడానికి దిగి తూటి చెట్ల కొమ్మలు చుట్టుకుని మృతి చెందాడు. మృతదేహం వెలికితీయడానికి రెండు రోజుల సమయం అయింది. మాసాయిపేట మండలంలో గల హల్దీ ప్రాజెక్టు శిఖం చుట్టూ ఇదే పరిస్థితి నెలకొంది.

తవ్వకాలతో భారీ గుంతలు

శివ్వంపేట మండలంలోని నీటి వనరులు కూడా ప్రమాదకరంగా మారాయి. శివ్వంపేట పెద్ద చెరువు, పిల్లుట్ల, దొంతి, అల్లీపూర్ తటాకాలు తుమ్మ, తూటి

శివ్వంపేట పెద్ద చెరువు ఇలా..

చెట్లతో నిండిపోయాయి. వీటి మరమ్మతులు జరిగినప్పుడు అవసరమైన మట్టి కోసం శిఖంలో జేసీబీలతో తవ్వడంతో భారీ గోతులు ఏర్పడ్డాయి. చిలప్‌చెడ్ మండలంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పలు గ్రామాల్లో చెత్తను నీటి వనరుల్లో పడేయడంతో అవి కలుషితం అవుతున్నాయి.

జంగల్ కటింగ్ కోసం ప్రతిపాదనలు

-రాజేందర్‌రావు, నీటి పారుదల శాఖ డిప్యూటీ ఈఈ, వెల్దుర్తి

జలవనరుల్లో పెరిగిన చెట్లు, పొదల తొలగింపు(జంగిల్ కటింగ్) కోసం ప్రత్యేకంగా ఎలాంటి నిధులు లేవు. నిధుల మంజూరు కోసం శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వారి సూచనల మేరకు చర్యలు తీసుకుంటాం.

బురద రోడ్డుతో ఇబ్బందులు

పట్టణ పరిధి రెండో వార్డులోని రహదారి బురదమయంగా మారింది. నర్సాపూర్- హైదరాబాద్ జాతీయ రహదారి నుంచి కొంతదూరం వరకు భూగర్భ మురుగు కాలువ, సీసీ రోడ్డు నిర్మించి మధ్యలో వదిలేశారు. ఈ మార్గంలో వెళ్లే సునీతారెడ్డి, జగన్నాథరావు, వినాయక్‌నగర్ కాలనీల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. – **న్యూస్‌టుడే, నర్సాపూర్**

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మెదక్, న్యూస్‌టుడే: మెదక్ వెస్లీ ఉన్నత పాఠశాలకు చెందిన 1993-94 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు 30 ఏళ్ల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. విద్యాబోధన చేసిన గురువులను సత్కరించారు. ఉదయం నుంచి ఉత్సాహంగా ఆడిపాడారు. పూర్వ విద్యార్థులు విజయానంద్, జనార్దన్, చంద్రశేఖర్, ఆనంద్ పాల్గొన్నారు.

శివ్వంపేట: దొంతి ఉన్నత పాఠశాలకు చెందిన 1991-92 పదో తరగతి విద్యార్థులు తూప్రాన్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో సమ్మేళనం నిర్వహించారు. అప్పటి గురువులను ఆహ్వానించి సన్మానం చేశారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

రామాయంపేట: రామాయంపేట మండల పరిధి అక్కనపేటలో 1978-82 మధ్య పాఠశాలలో చదివిన 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు, అప్పటి ఉపాధ్యాయులు సమావేశమయ్యారు. 54 మంది విద్యార్థులకు గాను 44 మంది హాజరయ్యారు.

రామాయంపేట మండలం అక్కన్నపేటలో..

తూప్రాన్: తూప్రాన్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 1996-97 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు పట్టనంలో సమ్మేళనం నిర్వహించి వారికి పాఠాలు బోధించిన ఉపాధ్యాయులకు సన్మానించారు.

ఊరంతా కలిసి.. గ్రంథాలయానికి బాట వేసి

అల్లాదుర్గం, న్యూస్‌టుడే: ప్రస్తుత పోటీ ప్రపంచంలో నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించాలంటే ఎంతో చదవాలి. అందుకు తగ్గ రకరకాల పుస్తకాలు అందుబాటులో ఉండాలి. గ్రంథాలయం ఏర్పాటు ద్వారానే ఇది సాధ్యమవుతుందని మండల పరిధి గడిపెద్దాపూర్ యువకులు గ్రహించారు. అనుకున్నదే తడవుగా వాట్సాప్ గ్రూప్‌లో గ్రామస్థులతో చర్చించారు. అందరూ తమ వంతుగా కృషి చేస్తామని పేర్కొన్నారు. యువకులు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, రాజకీయ నాయకులు ముందుకొచ్చి తమ వద్ద ఉన్న పుస్తకాలను ఇచ్చారు. కొందరు కుర్చీలు, టేబుళ్లు ఇవ్వగా కొందరు పుస్తకాల కొనుగోలుకు డబ్బులు విరాళం చేశారు. గ్రామంలోని ఓ వ్యక్తి గ్రంథాలయ ఏర్పాటుకు పాత ఇంటిని ఇచ్చారు. దీంతో గ్రంథాలయాన్ని సోమవారం ప్రారంభిస్తామని గ్రామ యువకులు తెలిపారు.

జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించాలి

పోటీలకు సిద్ధమవుతున్న రాష్ట్ర స్థాయి జట్టు

మనోహరాబాద్, న్యూస్‌టుడే: సాఫ్ట్‌బాల్ పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచాలని సాఫ్ట్‌బాల్ ఆసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి శోభన్‌బాబు అన్నారు. మనోహరాబాద్ క్రీడాప్రాంగణంలో రాష్ట్ర స్థాయి జట్టు శిక్షణ శిబిరానికి ఆదివారం ఆయన విచ్చేసి క్రీడాకారులకు పలు సూచనలు చేశారు. అక్టోబరు 6 నుంచి 10 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాలలో జరిగే 42వ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు తెలంగాణ బాలికల జట్టు శిక్షణ అక్టోబరు 3వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అభిషేక్, అజయ్ గౌడ్, శ్యాంసుందర్, గోవర్ధన్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, భిక్షపతి, కోచ్‌లు రేణుక, రవి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారిణులు దీపిక, రమ్య సూచించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మెదక్ పట్టణంలోని న్యాయస్థానాల ప్రాంగణంలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. పరిసరాల్లో ఉన్న పిచ్చి మొక్కలు, చెత్త తొలగించారు.

మనోహరాబాద్, న్యూస్‌టుడే: కూచారం గ్రామంలో జీఎమ్మార్ అధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించి రహదారి పక్కన మొక్కలు నాటారు. అనంతరం యువజన సంఘం భవనంలో విద్యార్థులకు స్వచ్ఛతపై ఉపన్యాస, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో జీఎమ్మార్ ప్రోగాం ఎగ్జిక్యూటివ్ శ్రీనివాస్, నేచర్ ఐకాన్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థుల ప్రతిభ

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: చిన్నశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల శనివారం విద్యార్థులు జిల్లా స్థాయిలో నిర్వహించిన యువజన క్రీడా సాంస్కృతిక ఉత్సవాల్లో ప్రతిభ చూపారు. సోలో ఫోక్ డ్యాన్స్‌లో ప్రథమ విజేతగా కె.ప్రేమ జ్యోతి, బృంద విభాగంలో ద్వితీయ బహుమతి కె.జ్యోతి గ్రూప్ సభ్యులు, పాటల విభాగంలో సుమలత, ఏక పాత్రాభినయం నాటకంలో భానుతేజ గెలుపొందారు. కళాశాల అధ్యాపకులు వేణుమాధవ్ మిమిక్రి, పాటలు పాడి అందరిని అలరించారు. విజేతలను ప్రిన్సిపల్ శశిధర్ అభినందించారు.

భాజపాను బలోపేతం చేస్తాం

నర్సాపూర్ రూరల్, న్యూస్‌టుడే: జిల్లాలో భాజపాను బలోపేతం చేస్తామని జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, రాష్ట్రకార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్ అన్నారు. మండలంలోని ఎల్లాపూర్‌లో ప్రధాని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమం వీక్షించారు. అనంతరం ప్రతి గ్రామంలో ఉన్న నాయకులు, కార్యకర్తలను కలిసి పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్తామని, కేంద్ర పథకాలపై అవగాహన కల్పిస్తామన్నారు. నాయకులు నీలి నాగేష్, శ్రీకాంత్, భాస్కర్, నాగరాజు, ఆంజనేయులు, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలను పరిరక్షించడం బాధ్యత

పెద్దశంకరంపేట: హిందూ ఆలయాలను పరిరక్షించుకోవడం అందరి బాధ్యత అని వీహెచ్‌పీ పెద్దశంకరంపేట ప్రఖండ అధ్యక్షులు శివశంకర్, ఖండ సమితి అధ్యక్షులు సంతోష్ కుమార్ అన్నారు. ఆదివారం పెద్దశంకరంపేటలో వారు మాట్లాడారు. సంప్రదాయాలను కాపాడుకోవడానికి సనాతన హిందూ ధర్మ బోర్డు ఏర్పాటు చేయడం అనివార్యమన్నారు. తిరుమల లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

పాత గేటును యథావిధిగా కొనసాగించండి

ఎంపీ రఘునందన్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రామాయంపేట, న్యూస్‌టుడే: పాత గేటును యథావిధిగా కొనసాగించాలని, అండర్ పాస్ బ్రిడ్జి చేయవద్దని పెద్దశంకరంపేట మండల పరిధి మిర్జాపల్లి, కామారం తండా వాసులు నాయకులు ఆదివారం ఎంపీ రఘునందన్ రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన హైదరాబాద్ నుంచి సిద్దిపేట వైపు వెళుతూ జాతీయ రహదారిపై ఉన్న హోటల్ వద్ద రామాయంపేట సమీపంలో ఆగారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన్ను కలిసి విన్నవించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి కారు కింద బోల్తా పడి ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన చిన్నశంకరంపేట పట్టణ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు... చేగుంట నుంచి మెదక్ వైపు అతివేగంగా వస్తున్న కారు చిన్నశంకరంపేట శివారు వద్దకు రాగానే ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న చందాపూర్ గ్రామానికి చెందిన వెంకట్ గౌడ్‌కు, కారులో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న వారి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఏరియా ఆసుపత్రికి తరలించారు.

అదృశ్యంపై కేసు నమోదు

తూప్రాన్, న్యూస్‌టుడే: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు తూప్రాన్ ఎస్సై శివానందం తెలిపారు. ఆయన కథనం మేరకు.. పురపాలక పరిధి తాత బాపన్‌పల్లికి చెందిన బీర్ల శ్రీశైలం(50) కొంతకాలంగా మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. అప్పుడప్పుడు ఇంట్లో నుంచి వెళ్లి కొన్ని నెలల తర్వాత ఇంటికి వస్తూ ఉండేవాడు. అయితే ఆరు నెలలుగా కనిపించకపోవడంతో ఆయన భార్య భార్య లక్ష్మి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పాలం వద్ద స్టార్టర్ చోరీ

- వరుసగా ఎనిమిదో సారి

కౌడిపల్లి, న్యూస్‌టుడే: వెల్మకన్నె శివారు పొలం వద్ద ఆదివారం స్టార్టర్ చోరీకి గురైంది. ఇక్కడే ఎనిమిదోసారి స్టార్టర్ చోరీకి గురికావడం గమనార్హం. పురోహితుడైన బాధిత రైతు గంటంబొట్ల ఉమాశంకర్‌శర్మకు గ్రామ శివారులోని మల్లికార్జునస్వామి ఆలయానికి సమీపంలో పొలం ఉంది. అందులోని బోరు వద్ద నుంచి ఎనిమిది నెలల కాలంలో ఎనిమిది సార్లు వరుసగా స్టార్టర్ బాక్సు, ప్రివెంటర్‌తోపాటు ఇతరత్రా సామగ్రిని ఎత్తుకెళ్లారు. దొంగతనం జరిగినప్పుడు ప్రతిసారి రూ.5 వేల వరకు ఖర్చు చేసి కొత్తది బిగిస్తున్నారు. ఈ విషయమై ఎస్సై రంజిత్‌రెడ్డిని వివరణ కోరగా ఫిర్యాదు రాలేదన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


కుమార్

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధి రుద్రారంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై నారాయణ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన కుమార్(47), ఎల్లవ్వ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత గురువారం కుమార్ పూటుగా మద్యం తాగి అర్ధరాత్రి తన ఇంటి పక్కన ఉన్న రమేష్ ఇంటి గడపపై గడ్డి వేసి నిప్పంటించి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దీనిని రమేష్ గుర్తించాడు. దీంతో ఎక్కడ తనను పిలిచి పంచాయితీ పెడుతారేమోనని భయాందోళనకు గురైన కుమార్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఆయన కుమారుడు మోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

మద్యం దుకాణంలో చోరీ

హవేలిఘనపూర్, న్యూస్‌టుడే: వైన్స్‌లో దొంగలు పడి మద్యంతో పాటు నగదు ఎత్తుకెళ్లిన ఘటన హవేలిఘనపూర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామ శివారులోని భవాని వైన్స్‌ను ఆదివారం ఉదయం నిర్వాహకులు తెరిచేందుకు రాగా దుకాణం షట్టర్ పగులగొట్టి ఉంది. గమనించిన నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించగా ఏఎస్ఐ రాజు ఆధ్వరంలో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. ఈ ఘటనలో రూ.1,95,200 నగదు, 19 మద్యం సీసాలను దుండగులు తీసుకెళ్లారని బాధితులు తెలిపారు. యజమాని నవాజ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రాజు వెల్లడించారు.

కవి సమ్మేళనంలో ఏఎన్ఎం

చేగుంట, న్యూస్‌టుడే: చేగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఏఎన్ఎం అనురాధ కామారెడ్డిలో ఆదివారం సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో జరిగిన కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. కవితా పఠనం చేసి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అనూరాధను ఘనంగా సన్మానించి జ్ఞాపిక బహూకరించారు. ఆమెను జిల్లా టీఎన్‌జీవోల సంఘం అధ్యక్షుడు నరేందర్, పీహెచ్‌సీ వైద్యాధికారి అనిల్‌కుమార్, సిబ్బంది అభినందించారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

దేవరాజు

నిజాంపేట, రామాయంపేట, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన నిజాంపేట మండల పరిధి రాంపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పొన్నబోయిన దేవరాజు(35) దుబాయ్ వెళ్లి వచ్చాడు. కుటుంబ కలహాలతో ఏడాది క్రితం భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెంది ఆయన ఈనెల 25న ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. గ్రామ సమీపంలోని చెరువు వద్ద దేవరాజుకు సంబంధించిన వస్తువులను స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. చెరువులో వెతకగా మృతదేహం లభించింది. తల్లి లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రూ.కోట్లు వెచ్చించారు.. నిర్వహణ మరిచారు..

- అధ్వానంగా వైకుంఠధామం

న్యూస్‌టుడే, తూప్రాన్: తూప్రాన్ పురపాలక కేంద్రంలో సుమారు రూ.1.50 కోట్లతో నిర్మించిన వైకుంఠధామం అధ్వానంగా మారింది. దీనిపై నిర్వహణ లేక విలువైన సామగ్రి దొంగల పాలవుతోంది. ఫలితంగా దహన సంస్కారాల సమయంలో ఇబ్బందులు తప్పడం లేదు. తూప్రాన్‌లో 2019లో వైకుంఠధామ నిర్మాణం పనులను ప్రారంభించి 2023లో అందుబాటులోకి తీసుకొచ్చారు. పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ఎవరైనా మరణిస్తే ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని ఉద్దేశంతో అన్ని సౌకర్యాలతో నిర్మాణాన్ని చేపట్టారు. కానీ నిర్వహణ లేక పచ్చని చెట్లతో కళకళలాడాల్సిన ఆవరణ పొదలతో కళావిహీనంగా మారింది. పనుల్లో నాణ్యత లేక ఆవరణలో ఏర్పాటు చేసిన టైల్స్ దిగబడి పోతున్నాయి.

స్నానాల గదిలో నల్లాలు, షవర్లు మాయం

సామగ్రి దొంగల పాలు..

దహన సంస్కారాలు పూర్తయ్యాక అక్కడే స్నానాలు చేసే విధంగా బాత్రూం గదులను నిర్మించారు. వీటిలో నల్లాలు, షవర్లు ఏర్పాటు చేశారు. వీటిని దొంగలు ఎత్తుకెళ్లారు. దీంతో నీటి సరఫరా నిలిచిపోయింది. ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకొచ్చి స్నానాలు చేసుకునే పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మొక్కలతో నిండిపోయిన వైకుంఠధామం

పర్యవేక్షణ చేస్తాం..

-భాజామొయినుద్దీన్, పురపాలిక కమిషనర్, తూప్రాన్

వైకుంఠధామ నిర్వహణపై పర్యవేక్షణ చేస్తాం. పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటాం. ఆవరణలో పెరిగిన మొక్కలను తొలగించి పరిశుభ్రంగా ఉంచేలా చూస్తాం. నల్లాలు ఏర్పాటు చేసి స్నానాలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

మెదక్	95730 81675
నర్సాపూర్	80085 73222
తూప్రాన్	96762 58144
చేగుంట	80085 73200

పెద్దశంకరంపేట 80085 73251
రామాయంపేట 94402 31031
(10AM TO 1 PM)

న్యూస్‌టుడే, నర్సాపూర్ రూరల్, వెల్దుర్తి, అల్లాదుర్గం

? నర్సాపూర్ మండలం ఎల్లారెడ్డిగూడ తండాకు సరైన రోడ్డు సౌకర్యం లేదు. పెద్దచింటకుంట స్టేజీ నుంచి మట్టిరోడ్డు ఉంది. బీటీ వేయాలని పలు తండాల వారు కోరుతున్నారు. ఏళ్లగా ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదు.– **విక్కునాయక్, ఎల్లారెడ్డిగూడ**

✔ మట్టిరోడ్డు ఉన్నవాటిని గుర్తించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే పనులు చేపడతాం. – **రాధికాలక్ష్మి, పీఆర్ ఏఈ**

?వెల్దుర్తిలో ఎలుకపల్లి చౌరస్తా వద్ద రోడ్డు కంకరతేలి ప్రమాదకరంగా మారింది. వర్షం పడితే గుంతల్లో నీరు నిలిచి చిత్తడిగా మారుతుంది. అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలి.– **రమేష్, ఎలుకపల్లి**

✔ చౌరస్తా వద్ద సమస్య ఉన్నమాట వాస్తవం. త్వరలోనే గుంతల్లో మొరం పోయించి ఇబ్బందులు తొలగిస్తాం.
– **బలరాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి, వెల్దుర్తి**

? మండల పరిధిలోని అల్లాదుర్గం నుంచి చేవెళ్ల గ్రామానికి వెళ్తే రోడ్డుపై లోతైన గుంతలు పడి కంకర తేలి ప్రమాదకరంగా మారింది. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కరించండి. –**రాజు, చేవెళ్ల**

✔ త్వరలో క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కరిస్తా.
–**విజయకుమార్, ఏఈ, పీఆర్, అల్లాదుర్గం**

కుళాయి ఏర్పాటు స్పందనకు వందనం

శివ్వంపేట, న్యూస్‌టుడే: శివ్వంపేటలోని ఒకటో అంగన్వాడీ కేంద్రానికి కుళాయి లేక చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై ఈ నెల 21న 'ఈనాడు'లో 'మేమున్నాం.. మీతోడుగా' శీర్షికన ప్రచురితమైన వార్తకు కార్యదర్శి రమాదేవి స్పందించారు. గ్రామపంచాయతీ కార్మికులతో నల్లా ఏర్పాటు చేయించారు.

హల్దీ వాగు చెంత సుందరీకరణ పనులు

తూప్రాన్, న్యూస్‌టుడే: తూప్రాన్ పురపాలక సంఘ పరిధిలోని కిష్టాపూర్ సమీపంలోని గద్దర్ లిఫ్ట్ ఇరిగేషన్ పంపు హౌస్ వద్ద సుందరీకరణ పనులు ప్రారంభించారు. పుర ఛైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతికృష్ణ ఆదివారం పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. లిఫ్ట్ ఇరిగేషన్ పంప్ హౌస్ వద్ద ప్రదేశాన్ని జేసీబీలతో చదును చేశారు. అందమైన మొక్కలు నాటి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ పర్యావరణ ఇంజినీర్ చింతల మధు, మన్నే భాస్కర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్‌కు నీటి ట్యాంకుల మంజూరు

నర్సాపూర్, న్యూస్‌టుడే: అమృత్‌లో భాగ